ప్రజాశక్తి
బుధవారం 18 అక్టోబర్ 2023 5
అనంతపురం

'చితి'కిపోయిన పసిహృదయం

- జ్వరంతో బాలుడు మృతి
- మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ఇవ్వని ప్రభుత్వ వైద్యులు
- ద్విచక్రవాహనంలో 30 కిలోమీటర్లు తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- మడకశిరలో అమానవీయ ఘటన

కుమారుడి మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

మృతి చెందిన రుషి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-మడకశిర

రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబం వారిది. భార్యాభర్తలు ఇద్దరూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. వీరికి ఒక్కగానొక్క కుమారుడు రుషి(5) ఉన్నారు. కూలి పనులు చేసుకుంటున్నా కుమారున్ని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. కంటికిరెప్పలా చూసుకుంటూ ప్రాణాలన్నీ కుమారునిపైనే పెట్టుకున్నారు. ఇంతప్రేమగా చూసుకుంటున్న కుమారుడు జ్వరంబారిన పడ్డాడు. గత వారం రోజులుగా బాలుడు జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్సలు చేయించినా నయం కాలేదు. దీంతో మంగళవారం ఉదయం చికిత్స కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు కన్నుమూశాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కుమారుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు ఆసుపత్రిలో ఆంబులెన్స్‌ను అడిగారు. వైద్యులు అంబులెన్స్‌ను ఇచ్చేందుకు అంగీకరించలేదు. వీరి గ్రామానికి ప్రయివేటు ఆంబులెన్స్‌లో కుమారుని మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే ప్రయివేటు వాహనదారులు రూ.5 వేల వరకు అడుగుతారు. ఇంత డబ్బు పెట్టలేని ఆ కూలీ దంపతులు కుమారుని మృతదేహాన్ని వారు వచ్చిన ద్విచక్రవాహనంలోనే తీసుకెళ్లారు. దాదాపు 30 కిలోమీటర్లు తల్లి కుమారున్ని ఎత్తుకోగా, తండ్రి వాహనం నడుపుతూ తీసుకెళ్లాడు. ఈ ఘటనను చూసిన వారికి కన్నీళ్లు తెప్పించింది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలో మంగళవారం ఉదయం చోటు చేసుకున్న ఈ అమానవీయ ఘటన పేదలపై ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్షంగా నిలుస్తోంది.

కళ్లెదుటే కుమారుడు మృతి

మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం హనుమంతనపల్లి గ్రామానికి చెందిన రాధమ్మ, పాతలింగప్పలు భార్యాభర్తలు. వీరికి ఒక్కగానొక్క కమారుడు ఋషి(5) ఉన్నాడు. గత వారం రోజులుగా బాలుడు జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్సలు చేయించినా నయం కాకపోవడంతో మంగళవారం నాడు చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన గంటల వ్యవధిలోనే చిన్నారి మృతి చెందాడు. తల్లిదండ్రుల కళ్లెదుటే కుమారుడు మరణించాడు.

ఆంబులెన్స్ ఇవ్వని వైద్యులు

కుమారుడు మృతి చెందడంతో మృతదేహాన్ని తీసుకుని వెళ్లేందుకు ఆసుపత్రిలోని ఆంబులెన్స్ ఇవ్వాలని తల్లిదండ్రులు వైద్యులను అడిగారు. అయితే ఏవో సాకులు చెప్పి ఆంబులెన్స్ ఇచ్చేందుకు వీల్లేదంటూ వైద్యులు తెలిపారు. దీంతో ప్రయివేటు వాహనదారులను సంప్రదించారు. వారు రూ.5 వేల వరకు బాడుగు అడగడంతో అంత ఇచ్చే స్తోమత లేని తల్లిదండ్రులు కుమారున్ని వారి ద్విచక్రవాహనంలో సొంతూరుకు తీసుకెళ్లేందుకు సిద్ధం అయ్యారు. తండ్రి వాహనం నడపగా, తల్లి కుమారున్ని భుజంపై వేసుకుని 30 కిలోమీటర్ల దూరంలోని వారి ఊరి వరకు తీసుకెళ్లారు. బాలుని మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో తీసుకెళ్తున్నారని తెలిసినా వైద్య సిబ్బంది ఎవరూ కూడా స్పందించకపోవడం గమనార్హం. తమకు సంబంధం లేని విషయం అన్నట్లుగా అక్కడి సిబ్బంది వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సమ్మెనోటీసుపై స్పందన

సమస్యలపై ఆరా తీసిన కమిషనర్

సంబంధిత అధికారులతో వివరాల సేకరణ

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 23వ తేదీ నుంచి మెరుపు సమ్మెకు దిగుతామని మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు అనంతపురం కార్పొరేషన్ అధికారులకు నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం నాడు కమిషనర్ భాగ్యలక్ష్మి స్పందించారు. ఉదయం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎటిఎం నాగరాజుతో సమస్యలపై చర్చించారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నాం కాదా... సమ్మె ఎందుకు చేస్తున్నారంటూ కమిషనర్ ప్రశ్నించారు. దీనిపై ఎటిఎం నాగరాజు స్పందిస్తూ కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. సమస్యలను పరిష్కరించి ఉంటే సమ్మె నోటీసు ఇవ్వాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. కారుణ్య నియామకాల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఏడాదిగా కారుణ్య నియామకం కోసం నిరీక్షిస్తున్న ఓ మహిళ పరిస్థితిని కమిషనర్‌కు తెలియజేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులు 27 మందికి నెలల తరబడి వేతనాలు అందని పరిస్థితి ఉందన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐను కూడా కార్మికులకు వర్తింపజేయడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వలేదన్నారు. స్కిల్ సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 12 మందికి పైగా కార్మికులతో బలవంతపు ఉద్యోగ విరమణి చేయించారని, వారి కుటుంబంలో ఇప్పటికీ ఎవరికీ ఉద్యోగం ఇవ్వలేదన్నారు. రెండు సంవత్సరాలుగా ఈ ఫైల్ పెండింగ్‌లో ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారంపై 55 సార్లు స్పందనలో ప్రతివారం వినతిపత్రాలు అందించామన్నారు. ఈ అర్జీలకు ఎలాంటి స్పందనా లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేసేది లేక మెరుపు సమ్మెకు సిద్ధమయ్యామని నాగరాజు కమిషనర్‌కు తెలియజేశారు. యూనియన్ నాయకులు తెచ్చిన పలు సమస్యలపై అప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ మాట్లాడినట్లు తెలుస్తోంది. కారుణ్య నియామకాలపై కమిషనర్ ప్రజారోగ్య సూపరింటెండెంట్ దేవశంకర్‌ను వివరణ తీసుకున్నారు. ఏడాది కావస్తున్నా కారుణ్య నియామకాల అంశం ఎందుకు ముందుకుసాగలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సిబ్బంది కొరత వల్ల ఈ సమస్య పెండింగ్‌లో ఉందని ప్రజారోగ్య సూపరింటెండెంట్ వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ రాంప్రసాద్ రెడ్డితో కార్మికుల ఉపాధి పనిముట్లు యూనిఫారం అందజేత వంటి అంశాలపైనా కమిషనర్ చర్చించారు. రెగ్యులర్ కార్మికులకు ప్రతి సంవత్సరం ఇచ్చే యూనిఫారాలు ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదన్నారు. మిగిలిన సమస్యలపైనా కమిషనర్ అధికారులతో తెలుసుకున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు కార్మికుల సమస్యలను పరిష్కరించి మెరుపు సమ్మెను ఆపిస్తారా.? లేక పట్టించుకోకుండా వదిలేస్తారా..? అన్నది వేచి చూడాల్సి ఉంది.

ఎంపిఇఓల చివరి ఆశ

- రెండేళ్లుగా గాల్లో దీపాల్లా మారిన ఉద్యోగాలు
- రేషనలైజేషన్‌లోనే దక్కుతుందన్న ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎంపిఇఒ (మల్టిపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు) ఉద్యోగాలు గాల్లో దీపాల్లాగా మారాయి. రేషనలైజేషన్‌లోనైనా తమ ఉద్యోగాలు నిలబడతాయోనన్న చివరి ఆశలతో ఎదురు చూస్తున్నారు. గ్రామీణ స్థాయిలో వ్యవసాయ విస్తరణ కోసమని ప్రభుత్వం గతంలో వీరిని నియమించింది. 2019లో వచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా వీరిలో చాలా మందికి పనిచేయడానికి చోటు లేకుండాపోయింది. వీరందరూ అప్పటి నుంచి గాల్లో దీపాల్లాగా మారారు. ప్రారంభంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 475 మంది ఎంపిఒలు ఉండేవారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటై అందులో వివిధ పోస్టులు భర్తీ తరువాత వీరికి పోస్టుల్లేకుండా పోయాయి. దీంతో వారిలో ఆందోళన నెలకొనడంతో ఖాళీ పోస్టుల్లో కొంత వరకు సర్దుబాటు చేశారు. దీని ప్రకారం అనంతపురం జిల్లాలో 213 మందిని సర్దుబాటు చేయగా , 262 మందిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఇందులో చిత్తూరు జిల్లాలో 105కి పోస్టింగ్ లభించాయి. తక్కిన 157 మందికి పోస్టుల్లేకుండాపోవడంతో అప్పటి నుంచి గాల్లోనే ఉంటూ వస్తున్నారు. అనంతపురం జిల్లాలో 213లో 53 మందికి పోస్టింగులేవు. మొత్తం 210 మంది పోస్టింగుల్లేకుండా గడిచిన రెండేళ్లకుపైగా ఉంటూ వస్తున్నారు. వీరు విధుల్లో చేరకుంటే తొలగిస్తామన్న తాఖీదులను ప్రభుత్వం 2022లోనే జారీ చేసింది. ఈ క్రమంలో ఇప్పుడు వ్యవసాయ శాఖలో జరుగుతున్న మార్పులు చిన్న ఆశను రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రాల్లో అవసరమైన చోట కొంత మంది ఉండగా అవసరం లేని వారు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఈ సమయంలో రేషనలైజేషన్ చేయాలన్న యోచన నడుస్తున్నట్టు సమాచారం. ఈ సర్దుబాటుల్లో ఖాళీ పోస్టుల్లో గాల్లోనున్న ఎంపిఇఒలకు అవకాశం లభిస్తుందేమోనన్న ఆశలు కొంత వరకున్నాయి. వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టి తమకు విధుల్లోకి తీసుకోవాలని ఎంపిఇఒలు విజ్ఞప్తులు సైతం చేస్తున్నారు. వేతనాల్లేక , ఉద్యోగాలు ఉంటాయో లేదే తెలియక జీవితాలు అత్యంత దుర్భరంగా గడుస్తున్నాయని ఎంపిఒలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనతోనున్నారు.

ఎంపిఇఒల సమస్యను పరిష్కరించాలి

ఎంపిఒలు గత కొంతకాలం గాల్లోనున్నారు. విధుల్లేక పోవడంతో జీతాలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని వారిని వీధుల్లోకి తీసుకోవాలి. సర్దుబాట్లుచేసి అవసరమైన చోట సిబ్బందిని వినియోగించాలి. గ్రామీణ స్థాయిలో వ్యవసాయంలో మెళకువలు చెప్పేందుకు అవసరమైన సిబ్బందిలో వీరు కూడా కీలకంగానే వ్యవహరిస్తారు. అనేక సంవత్సరాలుగా ఈ వృత్తినే నమ్ముకుని పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఎంపిఇఒలను వీధుల్లోకి తీసుకుని వారికి కుటుంబాలకు భద్రతనివ్వాలి.

నాగేంద్రకుమార్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

డాక్టరేట్ అందుకుంటున్న కొత్తిమీర చిదానంద

చిదానందకు డాక్టరేట్

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

గుమ్మగట్ట మండలం గలగల గ్రామానికి చెందిన కొత్తిమీర చిదానందకు బెంగళూరు విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టరేట్ పట్టాను బహూకరించింది. ఈమేరకు మంగళవారం బెంగళూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 58వ స్నాతకోత్సవంలో వర్శిటీ ఛాన్సలర్, కర్ణాటక గవర్నర్ తావర్చంద్ గేహ్లాట్ డాక్టరేట్‌ను అందజేశారు. తెలుగు విభాగం ఆచార్యులు ఆశాజ్యోతి పర్యవేక్షణలో 'ఆచార్య కొలకలూరి ఇనాక్ నాటక సాహిత్యము- ఒక పరిశీలన' అను అంశంపై చిదానంద పరిశోధన చేయగా బెంగళూరు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన చిదానంద తండ్రి వన్నూరప్ప గతంలో బళ్లారిలో సైకిల్ రిక్షా తొక్కుతూ జీవనం గడిపేవారు. వన్నూరప్ప ప్రస్తుతం అనంతపురంలోని సిపిఎం కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. శివానంద్‌కు తన అన్న, అక్క, చెల్లి, తమ్ముడు ఉన్నారు. వీరి ప్రోత్సహం, గురువుల సహకారం వల్ల డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు చిదానంద తెలిపారు. ప్రస్తుతం చిదానంద బెంగళూరు విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నాడు.

విభజన హామీలను అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్ర విభజన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆటో జాతా మంగళవారం శింగనమలకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో రాష్ట్రం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు నియోజకవర్గం అభివృద్ధికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని, హెచ్ఎల్‌సి ఆధునీకరణ చేపట్టాలని రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, సెంట్రల్ యూనివర్సిటీ నిధులు కేటాయించాలని, ఖరీఫ్‌లో నష్టపోయిన రైతన్న ఆదుకోవాలని, వలసల నివారణకు ఉపాధి పనులు విరివిగా కల్పించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ఎల్‌సి 5వ కాలువ బైపాస్ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని, రాచేపల్లి వద్ద ఉన్న లిడ్‌క్యాప్ చెప్పుల పరిశ్రమను ప్రారంభించి శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి కల్పించాలని, శ్మశానాలకు స్థలాలు కేటాయించాలని వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఆటోజాతా చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆయా సమస్యలపై వచ్చేనెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకన్న, జయరాముడు, ఆంజనేయులు, రామాంజనేయులు, గంప మల్లయ్య, ధన, మేకల పెద్దన్న, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్, సుంకన్న, వెంకటస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబిరెడ్డి, ఆంజనేయులు, కుల్లాయిస్వామి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, మునియప్ప, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య

సజావుగా ఈవీఎంల తనిఖీ : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి దశ ఈవీఎంల తనిఖీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్లో ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. నవంబర్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ స్పెషల్ ఆఫీసర్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

18న రాయదుర్గంలో జగనన్నకు చెబుదాం

ఈనెల 18వ తేదీన రాయదుర్గంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని డ్వామా, ఏపీడీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని రాయదుర్గం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

త్వరితగతిన ప్రాజెక్టులకు భూసేకరణ

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారులు, రైల్వేలు, ఏపీఐఐసీ, ఆర్అండ్‌బి, అహుడా తదితర ప్రభుత్వ ప్రాజెక్టులకు భూ సేకరణ అంశాలపై జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వేలు, ఎల్సీ గేట్స్, ఏపీఐఐసీ, ఎంఐజి, ఆర్అండ్‌బి, అహుడా, పవర్ గ్రిడ్, ఏపీఎస్పీసిపిఎల్, ఆర్అండ్‌ఆర్ తదితర ప్రభుత్వ ప్రాజెక్టులకు సకాలంలో భూమిని సేకరించాలని ఆదేశించారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం ఉండరాదని, అవసరమైన భూసేకరణను సకాలంలో చేపట్టి ఆయా ప్రభుత్వ ప్రాజెక్టులను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, రవీంద్ర, మధుసూదన్, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, అహుడా సెక్రటరీ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

మహిళా సమాఖ్యను బలోపేతం చేయాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మహిళా సమాఖ్యను బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని రోటరీపురం గ్రామంలో ఉన్న కొర్రపాడు-2 (బోడిగానిదొడ్డి) జగనన్న పాలవెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘాన్ని జెసి పరిశీలించారు. ఇందులో భాగంగా జగనన్న పాలవెల్లువ పథకం కింద గ్రామంలో అమూల్ డెయిరీకి పాలు పోసేందుకు ఎంతమంది రైతుల సిద్ధంగా ఉన్నారు.. ఎన్ని లీటర్లు పాలు సేకరించే అవకాశం ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ నాణ్యతను పరిశీలించారు. సెంటర్‌లో అవసరమైన పరికరాలు ఎప్పుడు వస్తాయని ఆరాతీశారు. అంతకుముందు రోటరీపురం గ్రామంలో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ అండ్ గేజ్ స్టేషన్ని పరిశీలించి, అక్కడ పరికరాలు అది ఎలా పని చేస్తాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, డిసిఒ ప్రభాకర్‌రెడ్డి, పశు సంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, ఏడీ రత్నకుమార్, వెటర్నరీ డాక్టర్ గోల్డ్‌మెన్, ఎంపిడిఒ తేజోష్ణ, తహశీల్దార్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జెసి కేతన్‌గార్గ్

పండ్లతోటల రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

రాష్ట్రంలోని పండ్ల తోటల రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఎకరాల్లో రైతులు విస్తారంగా పండ్ల తోటలు సాగు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మామిడి జీడి, బత్తాయి వంటి అనేక ఉద్యాన పంటలకు పసల్ బీమా పథకం అమలు చేయాలని, పకృతి వైపరీత్యాలు, చీడపీటలో వైరస్ దెబ్బతినే తోటలకు సమగ్ర ప్రంట బీమా ద్వారా రక్షణ కల్పించాలని, డ్రిప్పు, స్ప్రింక్లర్లను గతంలోలా 90 శాతం సబ్సిడీతో అందించాలని, నిల్వ వేసిన తైవాన్ స్ప్రేయర్లు సబ్సిడీతో ఇవ్వాలి, మామిడి, బత్తాయి, అరటి వంటి పంట తోటల రైతులకు మద్దతు ధర నిర్ణయించడంతోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల19న పట్టణంలోని ప్రియతమ ఫంక్షన్ హాల్‌లో పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి పండ్ల తోటల రైతులను ఐక్యం చేసేందుకు, ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు రెడ్డి రమేష్, జిల్లా కమిటీ సభ్యురాలు శిరీషా, మండల నాయకుడు జయశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : పండ్ల తోటల రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని తాడిపత్రిలో ఈనెల 19న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, సిఐటియు మండల నాయకులు బికె.భీమన్న పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు వెంకటేశులు, అశోక్, రామంజినేయులు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : తాడిపత్రిలో ఈనెల 19న నిర్వహించనున్న పండ్ల తోటల రైతుసంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శులు బిహెచ్.రాయుడు, సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసుదన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఎ వారు మాట్లాడుతూ పండ్ల తోటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో చర్చించడంతోపాటు రాష్ట్రస్థాయిలో ఒక కమిటీ ఏర్పాటు చేసేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి శీనప్ప, రైతుసంఘం నాయకులు సిద్ధప్ప, మురళి, వెంకటేష్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నవంబర్ 1 నుంచి విజయవాడలో ప్రీ ఆర్‌డి క్యాంప్

అనంతపురం కలెక్టరేట్ : నవంబర్ 1వ నుంచి 10వ తేదీ వరకూ విజయవాడలోని కేఎల్ యూనివర్శిటీలో ప్రీఆర్‌డి క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎసి.దివాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఐ.అఫ్రోజ్ బాను, జి.రేఖ ప్రీ.ఆర్.డి క్యాంపునకు ఎంపికైనట్లు తెలిపారు. విజయవాడలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు ఎన్.విష్ణుప్రియ, సోమశేఖర్, రామకృష్ణ, సుధాకర్, బాలాజీనాయక్, వైస్ ప్రిన్సిపల్ శశాంకమౌళి, బోటనీ విభాగాధిపతి శ్రీదేవి, అధ్యాపకులు సుంగప్ప, క్షమాభారతి, లక్ష్మీకాంత్, రామచంద్ర పాల్గొన్నారు.

మాస్టర్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం శివారులోని మాస్టర్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మాస్టర్ మైండ్ కళాశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, బిసి,ఎస్సీ,ఎస్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ మాస్టర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకెండియర్ బైపిసి చదువుతున్న విద్యార్థిపై కళాశాలలో సురేష్ అనే లెక్చరర్ నిన్న రాత్రి విద్యార్థులను తన వ్యక్తిగత కోపంతో చితక బాదాడని తెలిపారు. కొంత మంది విద్యార్థులకు చెప్పుల కాల్‌తో చేతుల మీద తొక్కడం, బెత్తం తీసుకొని కొట్టడం వంటి అనేక రూపాల్లో విద్యార్థులను మానసికంగా నైతికంగా వేధింపులు గురిచేశాడని తెలిపారు. విద్యార్థిపై వేధింపులకు గురి చేసిన సురేష్ లెక్చరర్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఆర్ఐఓ, జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి మాస్టర్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని, లేని పక్షంలో విద్యార్థి సంఘాలుగా మరిన్ని పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, నగర కార్యదర్శి శివ, నగర అధ్యక్షులు భీమేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు హేమంత్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని నెలగొండ గ్రామ సమీపంలో ఉన్న చెరువును ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు విస్తరణ 153 ఎకరాలు పైన ఉండగా ప్రస్తుతం విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఈ చెరువు ద్వారా నెలగొండ పులగుట్టపల్లి, పెద్ద తండా, చిన్న తండా, మల్లెనపల్లి, దోనిముక్కల, నల్లదాసరిపల్లి గ్రామాలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. అలాంటి చెరువును కొంతమంది ఆక్రమించడం వల్ల రానున్న రోజుల్లో నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని, చెరువును కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, నాయకులు సాకే నాగరాజు, జగ్గిలి రమేష్, వైటిసి రమేష్, రాముానాయక్, దాసరి చరణ్‌కుమార్, మద్దికేర ప్రతాప్, సిపిఐ మండల కార్యదర్శి రాము, నెలగొండ గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు బి.రాజు, ఓబులేసు, రామదాసు, వడ్డే రామాంజనేయులు, తిరుపతయ్య, ప్రసాద్, మల్లికార్జున, శ్రీనివాసులు, రాజు, గోవిందు, దేవదాసు, నీలకంతయ్య, ఓబుళనాయుడు, ఆంజనేయులు, సిపిఐ నాయకులు మండల సహాయ కార్యదర్శి పి.రామంజి, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్‌నాయక్, వేణు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పెద్దపప్పూరు : మండలంలోని తూట్లూరుపల్లి గ్రామానికి చెందిన నీరుగంటి చంద్రశేఖర్ (35) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... అనంతపురంలోని వన్‌టౌన్ పరిధిలోని రమణ ఫంక్షన్ హాల్లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న చంద్రశేఖర్ సోమవారం రాత్రి భార్యతో గొడవపడి తాడిపత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వచ్చాడు. దీంతో అనంతపురం నుంచి తాడిపత్రికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలో ముచ్చుకోట కనుమలో అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతునికి భార్య కవిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఈతకెళ్లి విద్యార్థి మృతి

గార్లదిన్నె : మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన ఉమేష్ చంద్రారెడ్డి (8) ఈతకెళ్లి నీటిలో మునిగి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... ఉమేష్ చంద్రారెడ్డి మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి హెచ్ఎల్సి కెనాల్‌కు ఈతకు వెళ్లాడు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి ఊపిరాడక మృతిచెందాడు. బాలుడు పాములరాయి వద్ద ఉన్న సాయి చైతన్య పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడని బంధువులు వాపోయారు. కొడుకు మరణ వార్త విని తండ్రి శివారెడ్డి, తల్లి పద్మావతి కన్నీటి పర్యంతమయ్యారు. బంధువుల అర్థనాదాలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలుడి మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

ఇసుక లారీ, ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలో తాడిపత్రి-బుగ్గ ప్రధాన రహదారిపై మంగళవారం అక్రమ ఇసుక తరలిస్తున్న లారీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సెబ్ అధికారులు తెలిపారు. సబ్ ఇన్స్‌పెక్టర్ తెలిపిన వివరాల మేరకు... ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా మంగళవారం తెల్లవారుజామున దాడులు చేసి లారీ, ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. వీటితోపాటు డ్రైవర్లు కురుబ రామకృష్ణ, పసలూరు ఆంజనేయులుపై కేసు నమోదు చేసి తాడిపత్రి రూరల్ అప్డేట్ పోలీస్‌స్టేషన్‌కు వాహనాలను తరలించినట్లు తెలిపారు.

రైతుకు పాముకాటు

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన రైతు అన్వర్‌బాషా మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... అన్వర్ బాషా తాను సాగు చేసిన మిరప పంటలో పని చేస్తుండగా గట్టుపై పాము కాటు వేసింది. వెంటనే చికిత్స నిమిత్తం బళ్లారికి వెళ్లి నిమ్స్ బళ్లారి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : స్థానిక తపోవనం సర్కిల్‌లో మంగళవారం కారులో అక్రమంగా తరలిస్తున్న 4 బాక్సుల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక తపోవనం సర్కిల్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కారులో తరలిస్తున్న 384 పాకెట్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారును స్వాధీనం చేసుకుని కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన శివకుమార్, స్థానిక స్టాలిన్‌నగర్‌కు చెందిన లింగాని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిద్దరూ కర్నాటక రాష్ట్రంలోని మొలకాల్మూరు నుంచి టెట్రా పాకెట్లు తీసుకొచ్చి అనంతపురంలో అమ్మేందుకు తెస్తూ సెబ్ పోలీసులకు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. ఈ దాడుల్లో ఇన్స్‌పెక్టర్‌తోపాటు సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

వారసత్వ వారోత్సవాలను జయప్రదం చేయాలి

అనంతపురం : జిల్లాలో నిర్వహించనున్న వారసత్వ వారోత్సవాలను జయప్రదం చేయాలని వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు ఇంటార్ జిల్లా కన్వీనర్ రామ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం అనంతపురంలోని రోటరీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కోటలు, పురాతన ఆలయాలు, శాసనాలు, కట్టడాలు ఉన్నాయన్నారు. వీటిని కాపాడుకోవడంతోపాటు అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. త్వరలోనే లేపాక్షికి ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం జిల్లా అధికారి నాగేశ్వర్‌రెడ్డి, ఆర్కియాలజీ రాష్ట్ర ఎడి రజిత, ఇంటాక్ సభ్యులు చంద్రహాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రాయ్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న జిల్లా రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం రాయదుర్గం మండల పరిధిలోని ఆవులదట్ల, జుంజురంపల్లి గ్రామాల్లో ఎండిపోయిన వేరుశెనగ పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా సాగు చేసిన వేరుశెనగ పంటలు పూర్తిగా ఎండిపోయాయనిరైతులు ధనుంజయ్య, తిప్పేస్వామి మాజీమంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. 2018 ఖరీఫ్‌లో పంటలు నష్టపోతే ఇంతవరకూ తమకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించలేదని వాపోయారు. పంటలు ఎండిపోయి తీవ్ర నష్టంలో ఉన్న తమకు బాసటగా నిలవడానికి ఎవరూ ముందుకు రావడం లేదని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా రైతులు పంటలు సాగు చేయడం.. వర్షాలు రాక ఎండిపోవడం జిల్లాలో పరిపాటిగా మారిందన్నారు. పంట పెట్టుబడుల రూపంలోనే జిల్లావ్యాప్తంగా సుమారు 800 కోట్ల రూపాయలను రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వ సాయం లేక రైతులు పంటను పండించలేమని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే గతేడాదికి, ఈ ఏడాదికి విస్తీర్ణంలో 2లక్షల ఎకరాల వ్యత్యాసం ఉందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు భరోసా కల్పించడానికి వైసీపీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ముందుకు రావడం లేదన్నారు. పాలకుల్లో చిత్తశుద్ధి, రైతుల పట్ల శ్రద్ధ లేకపోవడం వల్ల ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందన్నారు. సిఎం జగన్ రైతులను ఆదుకుంటానని ఎందుకు హామీ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రతి ఏటా పంట నష్టాలతో రైతులు ఆర్థికంగా చితికిపోతుంటే విప్ కాపు రామచంద్రారెడ్డికి చీమ కుట్టినట్లుగా కూడా లేదన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ మొద్దు నిద్ర లేచి రైతు సంక్షేమం, బాగు కోసం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, ఆవులదట్ల సర్పంచి వన్నూరుస్వామి, జుంజురంపల్లి సర్పంచి వన్నూరుస్వామి, ప్రసాద్, వీరేశ్, గిరిధర్ , నాగరాజు, కదరంపల్లి సోము, రమేష్, ఆంజనేయులు, తిప్పేస్వామి, రామంజినేయులు, గురుమూర్తి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆవులదట్లలో ఎండిన వేరుశనగను పరిశీలిస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

మజ్దూర్ యూనియన్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-గుత్తి

సికింద్రాబాద్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని గుంతకల్లు డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో ఎన్నికలకు సంబంధించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 ఎన్నికల మాదిరిగా ఈ ఏడాది ఎన్నికల్లో 28 ఓట్లు వేసి మజ్దూర్ యూనియన్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం రైల్వే ఇంజనీరింగ్, టిఆర్ డి, రైల్వే ఆరోగ్య, సీఎం డబ్ల్యూ విభాగాల్లో, డీజిల్‌షెడ్‌లో నాయకులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఆర్ఎఫ్ డివిజనల్ కార్యదర్శి మస్తాన్‌వలి, ఎడిఎస్ నారాయణ, బ్రాంచ్ కార్యదర్శి రామాంజనేయులురెడ్డి, శేఖర్ బాబు, గుంతకల్లు డీజిల్‌షెడ్ కార్యదర్శి రమణ, ఛైర్మన్ సుధాకర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

టీటీ పోటీల్లో హెచ్‌పిఎస్ విద్యార్థిని ప్రతిభ

శింగనమల : అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని శ్రీశాన్వి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. అండర్-13, అండర్-15 విభాగంలో రాష్ట్ర ప్రథమ స్థాయి సాధించి అండర్-17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. విజయాలు సాధించిన విద్యార్థినిని జిఎం.రామసుబ్బారెడ్డి, సిఇఒ ప్రతాపరెడ్డి, ఎజిఎం శంకర్‌నారాయణ, ప్రిన్సిపాల్ భాను, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

ఉరవకొండ : పేదరిక నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని గడేకల్ అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేదరిక నిర్మూలన జరగాలంటే ప్రతి ఒక్కరూ అక్షరాస్యతను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుశీల ఉమాశంకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, అంగన్‌వాడీ విజయలక్ష్మి, సిబ్బంది, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పుష్పావతి

పాలనలో సిఎం జగన్ అందరికీ ఆదర్శం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-నార్పల

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో సిఎం జగన్ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని మాలవాండ్లపల్లి, కమ్మకొట్టాలు, గొల్లపల్లి, సిద్ధరాచర్ల, బోయ కొట్టాల, దుర్గం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీల తారతమ్యాలు లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ, సిద్ధరాచెర్ల సర్పంచి నాగలింగారెడ్డి, మాజీ సర్పంచి లక్ష్మిరెడ్డి, పప్పూరు ఎంపీటీసీ పద్మాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పత్తిలో రసం పీల్చే పురుగును నివారించుకోవాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పత్తి పంటలో రసం పీల్చే పురుగును నివారించుకునేందుకు రైతులు తప్పక వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం మండలంలోని ఆవులాంపల్లిలో కృషి విజ్ఞాన వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శశికళ, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పత్తి పంటను పరిశీలించి రసం పీల్చే పురుగు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ రసం పీల్చే పురుగు నివారణకు ఆసిపెట్ 75 ఎస్పీ 1.5 గ్రాములు లీటరు నీటికి లేదా ఆసిటాంప్రైడ్ 0.3 గ్రాముల లీటరు నీటిలో లేక అల్లిపైరోఫెన్ 0.2 గ్రాముల లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్నలో టర్సికంబైట్ తెగులు ఉన్నందున పంటను కాపాడుకోవాడానికి హెక్సాకొనజోల్ లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు ఉధృతి కొంత తగ్గుముఖం పట్టినందున రైతులకు కొంతవరకు దిగుబడులపై ఆశలు పెట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి వ్యవసాయ ఎడిఎ వెంకటరాముడు, మండల వ్యవసాయాధికారిణి మల్లీశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారులు సునీత, రజనీ, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జిజిహెచ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న యునైటెడ్ జెఎసి ఫోరం నాయకులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రభలుతున్నాయి. ముందస్తుగా చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ పట్టన పౌర సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.అబ్దుల్ రసూల్, ఏజి.రాజమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, సర్వజనాసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఆర్‌డి వివిఎస్ఎన్.మూర్తి, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ఆస్కారం ఉందన్నారు. నగరంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు వేగంగా ప్రభలుతున్నాయని తెలిపారు.దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని, మురికి కాలువలో ప్రతి ఏడు రోజులకు ఒకసారి క్రిమి సంహారక మందులు పిచికారి చేయించాలన్నారు. అక్కడక్కడ నగరంలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. మురికి కాలువలు శుశుభ్రం చేయించాలన్నారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో రోగులకు అనుగుణంగా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. మలేరియా, డెంగ్యూ కేసులను పరిశీలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో మలేరియా, డెంగ్యూ కేసులపై అందిస్తున్న చికిత్సలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి వన్నూరప్ప, జిలాన్, రాజు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వాన్ని సాగనంపాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వచ్చే ఎన్నికల్లో సైకో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని బి.కొత్తపల్లి గ్రామంలో చంద్రబాబుతో మేము సైతం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టును వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్ల తర్వాత ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత చూసి సిఎం జగన్ టిడిపిపై అనేక కుట్రలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా చంద్రబాబును అక్రమగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. చంద్రబాబుకు ఆరోగ్య సమస్యలు వచ్చినా ఏమాత్రం మానవత్వం లేని ముఖ్యమంత్రి జగన్ అని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చంద్రబాబును విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు, మండల, గ్రామ నాయకులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న బండారు శ్రావణిశ్రీ

విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్‌నాయకులు

ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలి

గార్లదిన్నె : మీడ్‌పెన్నార్ రిజర్వాయర్ దక్షిణకాలువ ఆయకట్టుకు నీరు వదిలి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయకట్టుకు నీరు ఇస్తారని ఆశతో రైతులు పంట సాగు చేశారన్నారు. ఈనేపథ్యంలో నీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. తక్షణమే నీరు వదిలి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ ఓబిరెడ్డి, సీనియర్ నాయకుడు ఏకే నరసింహులు, సుబ్బారెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

In the court of the principal.District Judge,
Ananthapuramu
G.O.P.No:64/2023

Between:
Madikera Neelufar W/o Madikera Subhani Basha (Late) # 4/408, Near Khadriya Masjid, Guntakal Town & Mandal, Ananthapuramu Dist.
...Petitioner

And

Nil ...Respondants

GENERAL NOTICE

పై నెంబరు దావాలో కనపరచిన మడికెరు నీలూఫర్ మరియు మడికెర సుభాని బాషా అను ఇద్దరూ భార్య భర్తలు. వీరికి మడికెర సుమయ, ఉమ్మె కుల్సుమ్ మరియు టాస్మియా అన్జుమ్ అను ముగ్గురు మైనర్ కుమార్తెలు కలరు. ఈ మైనర్ల యొక్క తండ్రి మడికెర సుభాని బాషా షెడ్యూలు దాఖల ఆస్థి కొని ఉన్నారు. సదరు మడికెర సుభాని బాషా తేది:23/07/2021న మరణించినారు. పై తెలిపిన ముగ్గురు మైనర్ల ఉన్నత చదువులు మరియు వారి బాగోగులు చూసుకొనుటకు గాను షెడ్యూలు ఆస్తిలో వారికి చెందిన 3/4 భాగమును అమ్ముటకు అనుమతి మంజూరు చేయమని పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నారు. కావున ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల తేది:06/11/2023న ఉదయం 10:30 గం॥లకు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు హాజరు అయి తెలియచేయవచ్చును.

SCHEDULE

The House Plot Bearing No:145 Situated in Ananthapuramu RD, Guntakal SRD in L.P.No: 63/88 in Survey No:413/D Within Guntakal Municipality Limits.

Boundaries:
EAST : 30 Feet Wide Road,
WEST : Open Plot No:MIG-135,
NORTH : Open Plot No:MIG-146,
SOUTH : Open Plot No:MIG-144,

Measurements:
EAST-WEST : 39 Feet
NORTH-SOUTH : 60 Feet
Total Extent 260 Sq.Yards.

వాయిదా తేది:06/11/2023

(By order of The Hon'ble court)
D.C.SEKHAR,
M.P.BHARGAVI,
Advocates, Guntakal,
Cell:809917232.

SRI VENKATESWARA DEGREE & PG COLLEGE

ISO 9001:2015 CERTIFIED

Recognized by UGC under section 2(F) & 12 (B), Permanently Affiliated to S.K.University, Ananthapuramu # 12-3-415, Jesus Nagar, Ananthapuramu - 515001, (A.P.) Tel :08554-234477,91-9618469729
Website; www svdegreecollego.ac in, Email : Info@svdagreecollege ac in

DEGREE SPOT ADMISSIONS NOTIFICATION - 2023-24

Spot Admissions Date: 16-10-2023 to 19-10-2023

Course	Convenor Vacancy	EWS Vacancy	Course	Convenor Vacancy	EWS Vacancy
B.Sc Honours in Computer Science	2	9	BBA	1	0
Mathematics	10	3	BCA	1	0
Physics	1	3	B.Com Honours in		
Food Science & Technology	12	5	Computer Application	2	0
Biotechnology	2	3	Accounting	3	4

Few Management seats are available :B.Sc Honours-(Computer science, Maths, Physics, Statistics, Electronics, Biotechnology & Food Science and Technology), B.Com Honours (Accounting)

Note: 1.Seats under EWS are to be filled with eligible candidates belonging to OC category with a valid EWS certificate only. 2.For more details contact - 9618469729

Sd/-
CORRESPONDENT

ప్రాణాలు పోయినా భూమిని వదలం..

తహశీల్దార్ కార్యాలయం ఎదుట దళిత కుటుంబం ఆందోళన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

'మా ప్రాణం పోయినా భూమిని వదిలేదిలేదు..' అంటూ ఓ ఐదు దళిత కుటుంబాలు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా దళిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని మండలంలోని రోటరీపురం రెవెన్యూ పొలంలోని సర్వే నెం.19-1లో ఉన్న ఐదెకరాల భూమిని గత 20 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఈ మధ్యకాలంలో అగ్రకులానికి చెందిన వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగలేదన్నారు. దీంతో చేసేది లేక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగినట్లు తెలిపారు. వీరికి సిపిఎం, కెవిపిఎస్, దళిత సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సంజీవరెడ్డి, పుల్లయ్య, సిఐటియు నాయకులు నాగేంద్ర, దళిత సంఘాల నాయకులు చిన్న ఆంజనేయులు, భూ బాధితుడు ఎర్రప్ప కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న దళిత కుటుంబ సభ్యులు, నాయకులు

ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

సిఎం జగన్ ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్లాని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విస్తృస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగన్మోహన్‌రెడ్డి ఎందుకు కావాలి అనే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కావున పార్టీ నాయకులందరూ బాధ్యతగా ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. అలాగే ప్రతిపక్షాలన్నీ ఏకమై వైసిపి ప్రభుత్వంపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పుకొడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి పెద్దన్న, నాయకులు త్రిలోకనాథరెడ్డి, మచ్చన్న, రామాంజనేయులు, నాగిరెడ్డి, బి.శివలింగప్ప, జి.శ్రీనివాసులు, నక్కలపల్లి రామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఎర్రిస్వామి, పెద్దన్న, పి.శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, కరుణాకర్, నరిగన్న, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు పుష్పావతి, రేకమ్మ, వెంకటరెడ్డి, గోపాల్, పురుషోత్తమ, రుద్రానంద, పాతన్న, అశోక్‌బాబురెడ్డి, గోవింద్‌రెడ్డి, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై సిఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ

'సురక్ష'లో మంత్రి ఉషశ్రీచరణ్

బోరంపల్లిలో కళ్లజోడును అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్ర ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి జగనన్న ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలు లక్షలాది రూపాయలు ఖర్చుచేసి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళ్లలేరని గ్రహించిన సీఎం ప్రజల వద్దకే సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల సేవలను తీసుకొచ్చారన్నారు. అందుకోసమే ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో కమ్యూనిటి హెల్త్‌సెంటర్లను ఏర్పాటు చేసి వారికి కార్పోరేట్ వైద్యం అందజేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం : ముఖ్యమంత్రి జగన్ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఆదిమూర్తినగర్, అశోక్‌నగర్, అనంతపురం రూరల్‌లో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం అవినీతికి పెద్దపీట వేస్తే, వైసిపి ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యంగా నాడు-నేడు ద్వారా కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రులను తీర్చిదిద్దిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు ముంతాజ్‌బేగం, బి.జయమ్మ, వెంకటరమణ, సైపుల్లా బేగ్, రూరల్ సర్పంచి ఉదయ్, ఉపసర్పంచి సుమిత్రా, ఎంపిటిసి ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రజలకు మంచి పాలన అందించే సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకుందామని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని అభ్యుదయ మున్సిపల్ పాఠశాలలో పురపాలక సంఘం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు వారి పరిధిలో అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, వైద్య చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా వారికి అవసరమైన మందులను సైతం ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివప్ప, మున్సిపల్ వార్డు సభ్యులు శారద, గోవింద, గోవిందరాజులు, ఫక్రుద్దీన్, షబ్బీర్, వన్నూరుస్వామి, శ్రీనివాసులు రెడ్డి, హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మారుతీప్రసాద్, డాక్టర్ సందేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : గ్రామస్థాయిలోనే వైద్యసేవలు అందించేందుకు సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వజ్రహొన్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, ఎంపిటిసి అరుణ్‌కుమార్, నాయకులు ఉపేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషన్ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అలాగే ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ చెన్నకేశవులు, వైద్యులు బిందు భార్గవి, ఎల్లరాముడు, కృష్ణప్రసాద్, దివ్య, మున్సిపల్ డిఇఇ రఘు,ఎఇ సాయినాథ్ బాబు, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, ఆర్ఐలు షేక్షావలి, సికె. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో సర్పంచి మెట్టు లావణ్య, మెట్టు లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

పుట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణ ప్రాంతవాసులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్లుట్ల సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 294మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి మల్లేష్‌ప్రసాద్, స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని వెంకటాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 507 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం పెద్దాసుపత్రికి సిఫారసు చేశారు. అలాగే 101 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి ఓబులు, జడ్పిటిసి నీలం భాస్కర్, ఎంపిడిఒ తేజోష్ణ, గృహసారథుల మండల కన్వీనర్ బైపిరెడ్డి, సర్పంచి వసంతకుమార్, రమేష్, వైద్యులు శ్రీహర్ష, వినోద్, గణేష్, దామోదరమ్మ, మండల సామాజిక ఆరోగ్య అధికారి మోహన్‌బాబు, పర్వీన్ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, కేశవయ్య, సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టు శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ కరుణాకర్, సచివాలయం కార్యదర్శి రియాజ్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రజలకు ఉచితంగా వైద్యం అందించేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారని రాప్తాడు ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం నగర సమీపంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, సాకే లోకేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణానాయక్

ప్రజాశక్తి-ఉరవకొండ

మాట్లాడుతున్న వృత్తి విద్యాధికారి వెంకటరమణానాయక్

నేటి విద్యార్థులు మెలకువలు పాటిస్తే సాంకేతిక విద్యా విధానంలో ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు బంగారు భవిష్యతకు బాటలు వేసుకోవచ్చని జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణనాయక్ అన్నారు. మంగళవారం ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ బాల, బాలికల కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కళాశాలలో జరుగుతున్న త్రయం పరీక్షలు నిర్వహిస్తున్న తరగతి గదులలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా నేటి విద్యార్థులు కూడా సాంకేతిక విద్యతోపాటు ఇంగ్లీష్ సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. రానున్న కాలమంతా టెక్నాలజీ ఇంగ్లీష్‌తో ముడిపడి ఉందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. కళాశాల అధ్యాపక సిబ్బంది కూడా ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు వారు తెలుసుకుంటూ విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మమత, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని కమిషనర్ జి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాభావంతో పెన్నానదిలో వేసిన బోర్లు వట్టి పోయాయని దీంతో తాగునీటిని కోళాయిలకు సరఫరా చేయలేకపోతున్నామని వివరించారు. శ్రీసత్యసాయి, వైటిసి తాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రతిరోజు 27 లక్షల లీటర్ల తాగునీరు రావాల్సి ఉండగా 0.8 లీటర్లు మాత్రమే తాగునీరు వస్తోందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తాగునీటి కోసం 20 బోర్లు వేస్తున్నామన్నారు. తీవ్రంగా తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

బీమా సాయం అందజేత

రాయదుర్గం : పట్టణంలోని 17వ ఎన్నికల వార్డు గుగ్గిరెట్టి ప్రాంతంలో అనారోగ్యంతో మృతిచెందిన షేక్ అబ్దుల్ మజీద్‌కు మంజూరైన వైఎస్ఆర్ బీమా పథకం చెక్కును మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళ్లు శిల్ప, వైస్‌ఛైర్మన్ జి.వలిబాషా, తదితరులు మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు శారద, పద్మజ, వార్డు ఇన్‌ఛార్జి బషీర్, దివాకర్, ఇస్మాయిల్, సచివాలయ కార్యదర్శి మల్లికార్జున, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయదుర్గంలో 'జగనన్నకు చెబుదాం'

రాయదుర్గంరూరల్ : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న డ్వామా కార్యాలయంలో కలెక్టర్ గౌతమి అధ్వర్యంలో బుధవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కొండయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం మండల ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

పెద్దవడుగూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దవడుగూరు, కిష్టిపాడు గ్రామాల్లో వెలసిన చౌడేశ్వరీదేవి, సుంకులమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో మంగళవారం నవరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

శింగనమల : మండలంలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బండి దైవత్వం కుటుంబానికి అండగా ఉంటామని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. దైవత్వం తల్లి నారాయణమ్మ మృతిచెందడంతో విషయం తెలుసుకున్న దండు శీనా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, టిఎన్ఎస్ఎఫ్ బండి పరుశురాం, బండి పరుశు రాం, బెస్త నారాయణస్వామి, బాలన్న, నారాయణస్వామి, ప్రసాద్‌నాయక్, నరసింహనాయక్, శివ, మల్లికార్జున, సురేష్, మారుతి, వెంకటన్న, వెంకటేష్, లాలెప్ప, వెంకటన్న, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం : జిల్లాలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు డి.మస్తాన్ భార్య ఖాసీంబీకి రూ.4,29,600లో చెక్కును ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ మంగళవారం అందజేశారు. జిల్లాలో ఉన్న హోంగార్డులు, సహచర హోంగార్డు కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో తమ జీతంలోని ఒకరోజు శాలరీని ఇవ్వడం అభినందనీయమని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రంలో ఎంఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, ఆర్ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మల్లప్ప

ఉరవకొండ : ఉరవకొండ మండల వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఆమిద్యాల గ్రామానికి చెందిన మల్లప్పను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, స్థానికసర్పంచి శ్రీరాములు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడుతూ ఉరవకొండ మండలంలో వైసిపి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పదవి కేటాయించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, యువజన విభాగం జోనల్ అధ్యక్షులు ప్రణయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పేద కళాకారునికి ఆర్థికసాయం

అనంతపురం కలెక్టరేట్ : పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో నగరానికి చెందిన పేద కళాకారుడు కీబోర్డ్ సంగీత వాయిద్య కళాకారుడు శ్రీనివాసులకు రూ.50 వేలు ఆర్థిక సహాయంతో పాటు, 60 కేజీల బియ్యం అందజేశారు. మంగళవారం పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి సంస్థ గౌరవాధ్యక్షులు రవికాంత్ రమణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాభారతి అధ్యక్షులు సుగుమంచి సురేష్‌బాబు, ఉపాధ్యక్షులు కె.సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ విజయరామయ్య, ఆదినారాయణ, మారుతీప్రసాద్, శ్రీనివాసులు, కేశవ, సర్దార్‌బాబు, హైదర్‌వలి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బిఎన్ అధ్యాపకునికి జాతీయ పురస్కారం

అనంతపురం : అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న నల్లారెడ్డి గారి ఓబిరెడ్డి పద్మశ్రీ బోయి భీమన్న గారి జాతీయ సాహితీ పురస్కారం అందుకున్నారు. ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా భాకరాపేటలోని అర్జున్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో ఓబిరెడ్డికి పురస్కారం అందజేశారు. ఇందులో భాగంగా తెలుగు సాహిత్యంలో కవిగా, రచయితగా, వక్తగా, అధ్యాపకులుగా, విద్యావేత్తగా కృషి చేసినందుకు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ, ప్రొఫెసర్ బుజ్జి మార్జియానా, ప్రొఫెసర్, కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.